

ఇక స్థానిక సమరం





ముఖ్యమంత్రి ప్రకటనతో వేడెక్కుతున్న రాజకీయం

పల్లెల్లో మొదలైన ఎన్నికల సందడి

మూడు దశల్లో నిర్వహణకు సన్నాహాలు

మున్సిపాలిటీ విలీన గ్రామాల పరిస్థితిపై చర్చ

మంచిర్యాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో జిల్లా వ్యాప్తంగా ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. వాస్తవానికి లోక్‌సభ ఎలక్షన్లు ముగియగానే, స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం అయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, పాలనపై పట్టు సాధించేందుకు కొంత సమయం పట్టింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కొంత ఆలస్యమైనప్పటికీ ముఖ్యమంత్రి ప్రకటనతో ఆ ప్రక్రియ ఊపందుకుంది.

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జిల్లాలో అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు అధికారులు సన్నద్ధం కూడా అవుతున్నారు. గ్రామ పంచాయతీల పాలన ఈ సంవత్సరం ఫిబ్రవరిలో ముగియగా, జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పాలకవర్గాల పదవీ కాలం జూలైతో ముగిసింది. సర్పంచ్‌లు పదవీచ్యుతులై సుమారు ఐదు నెలలు గడుస్తుండడం, పాలక వర్గాలు లేకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి కొంతమేర కుంటుపడింది. మరోవైపు స్థానిక సంస్థల పాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లింది. గరిష్ఠంగా మూడు నెలలకు మించి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగరాదనే నిబంధన ఉంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వానికి అనివార్యం అయింది. కాగా సెప్టెంబరులో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

విలీన గ్రామాల్లో..

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమాయత్తం అవుతుండడంతో మున్సిపాలిటీల్లో విలీన గ్రామాల పరిస్థితిపై ప్రస్తుతం జోరుగా చర్చ కొనసాగుతోంది. మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా అవతరించబోతుందనే ప్రచారం జరుగుతుండడంతో ఏయే గ్రామాలను విలీనం చేయబోతున్నారనే చర్చ సాగుతోంది. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడితే సమీప మున్సిపాలిటీలైన నస్పూర్, క్యాతన్‌పల్లిలను అందులో విలీనం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఆయా మున్సిపాలిటీలతో పాటు పరిసర గ్రామాలు కూడా కార్పొరేషన్‌లో విలీనమయ్యే అవకాశం ఉంది. కార్పొరేషన్ ఏర్పాటుకు కావలసిన కనీస జనాభాను దృష్టిలో ఉంచుకుని కొన్ని గ్రామాలను విలీనం చేయక తప్పని పరిస్థితి నెలకొంది. ఇందులో భాగంగా హాజీపూర్ మండలంలోని వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట గ్రామాల విలీనం తప్పదనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇదే జరిగితే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా గ్రామాల్లో ఎలక్షన్లు నిర్వహిస్తారా...లేదా అన్న సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. నవంబరులో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నందున విలీన గ్రామాల్లో ఎన్నికలు ఉండకపోవచ్చనే ప్రచారమూ జరుగుతోంది. ఈ విషయమై మరింతగా స్పష్టత రావలసి ఉంది.

జిల్లాలో 621 గ్రామాలు..

స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జిల్లాలోని 311 గ్రామ పంచాయతీల పరిధిలోని 621 గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. జిల్లాలో రెండు పంచాయతీ డివిజన్లలో 16 మండలాలు ఉండగా, వాటి పరిధిలో మొత్తం 2730 వార్డులు ఉన్నాయి. అలాగే ఎంపీటీసీ స్థానాలు 130 ఉండగా, జడ్పీటీసీ స్థానాలు 16, ఎంపీపీ స్థానాలు 16 ఉన్నాయి. రాష్ట్రంలో 2018 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గత పంచాయతీ ఎన్నికలు జరిగాయి. 2019లో మూడు విడతల్లో ఎన్నికలు జరుగగా, 2024 జనవరి 31తో గ్రామ పంచాయతీల పాలకవర్గం పదవీ కాలం ముగిసింది. ఈ క్రమంలో ముందుగా పంచాయతీ ఎన్నికలకు అధికారులకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను సిద్ధం చేసే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది.

రిజర్వేషన్లు యథాతథం..

స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పుడున్న రిజర్వేషన్లే అమలు చేయనున్నట్లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. పంచాయతీ వార్డులు మొదలుకొని జడ్పీ ఛైర్మన్ స్థానం వరకు గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేసిన విధంగానే రిజర్వేషన్ అమలు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. ప్రభుత్వ నిర్ణయం మేరకు ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించిన అనంతరం సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల కోసం సిద్ధమవుతున్న ఆశావహులు ఈ సారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే ఉద్దేశ్యంతో ఉన్నారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్ట సవరణ చేయడం ద్వారా రిజర్వేషన్లు పదేళ్ల వరకు ఉండేలా మార్పులు చేసింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అదే చట్టాన్ని అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చింది. పాత చట్టం ప్రకారం రిజర్వేషన్లు అమలుచేసే పక్షంలో ఇంతకు ముందు బరిలో నిలిచి విజయం సాధించిన సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు మళ్లీ పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది.

ఆధ్యాత్మిక మాసం శ్రావణం

● రేపటి నుంచి ప్రారంభం ● శుభ ముహూర్తాలు మొదలు



శ్రీ రామసహిత సత్యనారాయణస్వామి దేవతమూర్తులు

నస్పూర్/దండేపల్లి, ఆగస్టు 3: భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, ఆచారాలల్లో శ్రావణ మాసానికి అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంది. మహిళలు అత్యంత పవిత్రంగా భావించే శ్రావణ మాసంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయిస్తే సకల సంపదలు కలుగుతాయని భావిస్తారు. శ్రావణ మాసం ఆధ్యాత్మిక లక్ష్మీప్రదమైన మాసంగా పేరుంది. ఈ నెల రోజుల వ్యవధిలో లక్ష్మీదేవిని ఆరాధించిన భక్తులకు సకల సంపదలు లభిస్తాయని నమ్మకం. శ్రావణ మాసంలో గృహాల గడపలకు పసుపు, మామిడి తోరణాలతో అలంకరణలు, ముత్తైదువుల రాకపోకలతో సందడి నెలకొంటుంది. వరలక్ష్మీ వ్రతం ఆచరించిన భక్తుల కోరిన కోర్కెలు నెరవేరి అనుకున్న విధంగా శుభ ఫలితాలను ఆ జగన్మాత లక్ష్మీదేవత అనుగ్రహిస్తుందని నమ్ముతారు. శ్రావణ మాసం ఈ నెల 5 నుంచి ప్రారంభమై వచ్చే నెల 3వ తేదీతో ముగుస్తుంది. ఈ శ్రావణ మాసంలో మంగళగౌరీ, మహాలక్ష్మీ, వరలక్ష్మీ వ్రతాలను మహిళలు ఎక్కువ ఆచరిస్తారు.

● మాసంలో పండుగలు..

శ్రావణ మాసంలో సోమవారాలు-5, శుక్రవారాలు-4 శనివారాలు-4 వస్తున్నాయి. 8వ తేదిన నాగుల చవితి, 9న నాగుల పంచమి, 16న వరలక్ష్మి వ్రతం, 19న రాఖీ పౌర్ణమి, 26న శ్రీకృష్ణాష్టమిలున్నాయి. వాడవాడల సంబరాలతో సందడి నెలకొంటుంది. శ్రావణ మాసంలో సోమ, శుక్రవారాలల్లో రెండు రోజులు మహాశివుడిని. లక్ష్మీదేవిని పూజా రోజున పొద్దున, సాయంత్రం దీపారాధన చేయడం, ధీర్ఘసుమాంగళి ప్రాప్తించడంతో పాటు అష్టైశ్వర్యాలను ప్రసాదిస్తుందని మహిళలు ప్రత్యేక పూజలు చేస్తారు. కాగా మూడం కారణంగా మూడు మాసాలుగా నిలిచిపోయిన శుభ కార్యక్రమాలు సోమవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28, 30 తేదీల్లో వివాహాలు, గృహ ప్రవేశాలు, వివిధ కార్యక్రమాలు మొదలు కానున్నట్లు పండితులు చెబుతున్నారు.

● వరలక్ష్మీ వ్రతం..

శ్రావణ మాసంలో శుక్ల పక్షం, పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుతారు. వరలక్ష్మీ దేవత విష్ణుమూర్తి భార్య. హిందూ మతం ప్రకారం విశిష్టమైనది. వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మీ దేవిని కొలుస్తారు. వివాహమైన మహిళలు మాత్రమే నిర్వహిస్తారు. ఈ రోజున పూజిస్తే అష్టలక్ష్మీలకు పూజించి నట్లేనని మహి ళల విశ్వాసం. సంపద, ప్రేమ, కీర్తి, శాంతి సంతోషం, శక్తి తదితరాలు లభిస్తాయని విశ్వాసం.

● మంగళగౌరీ వ్రతం..

శ్రావణ మాసంలో శ్రీ వరలక్ష్మీ వ్రతం, శ్రీ మంగళగౌరీ వ్రతం శ్రావణ మాసంలో వచ్చే నాలుగు మంగళవారాలు మంగళగౌరీని ప్రత్యేకంగా పూజిస్తారు. పార్వతీ దేవికి మరో పేరు (గౌరీ) మంగళ గౌరీ అని చెబుతారు. ఈ వ్రతం చేయడం వల్ల మహిళలకు సౌభాగ్యకరమైన 'ఐదవతనం' కలకాలం నిలుస్తుందని మహిళల విశ్వాసం.

● మహాలక్ష్మీ పూజ..

శ్రావణ శుక్రవారం మహాలక్ష్మీని మహిళలు ప్రత్యేకంగా పూజిస్తారు. శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాలను మహిళలు నియమనిష్టలతో పూజి స్తే సిరిసంపదలు వెల్లివిరుస్తాయని భక్తుల విశ్వాసం. శ్రావణంలో రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్దలతోవైభవంగా జరుపుకుంటారు. పెళ్లయిన తర్వాత వచ్చే తొలి శ్రావణంలో ఈ వ్రతాన్ని నూతన దంపతులచే పూజలు చేయిస్తారు. వ్రతం చేయడం ద్వారా భర్త ఆరోగ్యం, ఆయుష్షు బాగుంటుందని, వ్రతం చేసిన మహిళలు తోటి ముత్తైదువులకు పూర్ణాలు, గారెలు వాయినం అందజేసి ఆశీస్సులు పొందుతారు. మహాలక్ష్మీ విగ్రహాన్ని అలంకరణ చేసి పేరంటాలను పిలిచి తాంబూలం ఇస్తారు. ఈ క్రమంలో ప్రతీ ముత్తైదు ను మహాలక్ష్మీ రూపంగా భావించి గౌరవిస్తారు.

గుండెపోటుతో మాజీ కౌన్సిలర్ మృతి

ఏసీసీ, ఆగస్టు 3 : మంచిర్యాల పట్టణంలోని ఎడ్లవాడకు చెందిన దాసరి లచ్చన్న (78) మాజీ కౌన్సిలర్ శనివారం మృతిచెందాడు. రెండు రోజుల క్రితం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మోకాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న లచ్చన్నకు శనివారం సాయంత్రం హఠాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబీకులు మరో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన కౌన్సిలర్‌గా చేసిన సేవలను అభినందనీయమని కొనియాడారు.న

నీట్‌లో 690వ ర్యాంకు

చెన్నూరు, ఆగస్టు 3: నీట్ పరీక్ష ఫలితాల్లో చెన్నూరు విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. పట్టణానికిచెందిన శ్రీకిరణ్ ల్యాబోరేటరీ యాజమాని రమేష్ కుమారుడు శ్రీపాద శివమణి నీట్ ఫలితాల్లో 690వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

మహిళలపై కొనసాగుతున్న వివక్ష

నస్పూర్, ఆగస్టు 3 : కట్టుబాట్లతో మహిళలను వంటింటికే పరిమితం చేస్తూ వివక్షకు గురి చేస్తున్నరని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షురాలు ఎం. జ్యోతి అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్ హాల్‌లో మంచిర్యాల డివిజన్ 7వ మహాసభ శనివారం జిల్లా సహాయ కార్యదర్శి డి. అరుణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బ్రహ్మానందంతో పాటు 40 మంది ప్రతినిధులు హాజరైయ్యారు. కాగా డివిజన్ కమిటీ ప్రగతి శీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) మంచిర్యాల డివిజన్ నూతన కమిటీని ప్రకటించారు. డివిజన్ అధ్యక్షురాలుగా మంగ (మంచిర్యాల), ఉపాధ్యాక్షురాలుగా మహేశ్వరి(మందమర్రి), లలిత (శ్రీరాంపూర్), ప్రధాన కార్యదర్శిగా అనిత (లక్సెటిపేట), సహాయ కార్యదర్శిగా మీనా (మందమర్రి), శ్యామల (మంచిర్యాల), కోశాధికారిగా రాజా కళ (శ్రీరాంపూర్)లతో పాటు మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధ్యతల స్వీకరణ

ఏసీసీ, ఆగస్టు 3: మంచిర్యాల ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ప్రదీప్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో మంథని సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ప్రియాంకను మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. కాగా సబ్‌రిజిస్ట్రార్ ప్రియాంక శుక్రవారం సాయంత్రం మంచిర్యాలలో బాధ్యతలు చేపట్టి ఈ నెల 20న తన వివాహం ఉండడంతో నెల రోజులు సెలవు పెట్టింది. ఈ నేపథ్యంలో మంచిర్యాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రదీప్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఆక్రమణల తొలగింపు

ఏసీసీ, ఆగస్టు 3: మంచిర్యాల పట్టణంలోని జడ్పీ బాలు ర ఉన్నత పాఠశాల కాంపౌండ్‌ను ఆనుకుని రోడ్డుపై అక్రమంగా నిర్మించిన షట్టర్లనుమున్సిపల్ సిబ్బంది శనివారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. షట్టర్లను అద్దెకు తీసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి మున్సిపల్ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని తొలగింపు అడ్డుకుంటున్న వారిని పక్కకు తీసుకువెళ్లారు. కాగా రోడ్లపై నిర్మించిన ఆక్రమణలు తొలగించాలని మున్సిపల్ అధికారులు గతంలోనే ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. కాగా ఫలితం లేకపోవడంతో అధికారులు తొలగింపుకు పూనుకున్నారు.

ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ మండల కమిటీ

కోటపల్లి, ఆగస్టు 3 : కోటపల్లి మండల ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ కమిటీని శనివారం ఎన్నుకున్నట్లు ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ , రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్ర పాణిలు శుక్రవారం తెలిపారు. అధ్యక్షుడిగా పెందోటి ఉమ, జనరల్ సెక్రటరీగా ఒద్ది సంతోష్ ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్ , జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి కోరళ్ల శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు ఖాజాకంరొద్దీన్, జగన్‌మోహన్‌రెడ్డి, డీసీఈబీ సభ్యుడు ఇష్తేఖర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- అభివృద్ధి పనులకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించాలి

- ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



కిష్టాపూర్ లోలెవెల్ వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

జైపూర్, ఆగస్టు 3: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. మండలంలోని కుందారం, కిష్టాపూర్, పౌనూరు, వేలాల, శివ్వారం గ్రామాల్లో శనివారం పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లోని సమస్యలు విని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కుందారం- కిష్టాపూర్ గ్రామాల మధ్య గల పెద్దవాగుపై హై లెవెల్ వంతెన నిర్మించాలని గ్రామస్థులు విన్నవించారు. కుందారంలో గ్రామంలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కుందారంలో ప్రారం భానికి సిద్ధగా ఉన్న ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలించి ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్డు, కాంపౌండ్‌వాల్‌కు ఫండ్స్ కావాలని వైద్యులు పేర్కొనడంతో సానుకూలంగా ఎమ్మెల్యే స్పందించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి,చల్ల సత్యనారాయణరెడ్డి, విశ్వంభర్‌రెడ్డి, ఫయాజ్, జక్కుల వెంకటేశం ఉన్నారు. కాగా మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం పర్యటించిన ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిని శివ్వారం గ్రామంలో ఎంపీవో శ్రీపతి బాపురావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లు ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

భీమారం: బీమారం మండల అభివృద్ధి ధ్యేయమని, మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పీఎంశ్రీ పథకం మంజూరైన రూ. 14 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని ప్రధానోపాధ్యాయుడు విక్రమ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాదన్నగూడెం, నాయకపోడుగూడెం, బంజారాకాలనీ, లాల్ బహదూర్ కాలనీల్లో డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 55 లక్షలతో పలు పనులకు భూమి పూజ చేశారు. ఎస్సీ కాలనీ,ముదిరాజ్ కాలనీ, పెరకగూడెంలలో విశాఖ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేసిన మంచినీటి బోరు పంపులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్టు ద్వారా విడుదలయ్యే ప్రధాన కాలువల నీరు సబ్ కాలువలకు అందక సుమారు 250 ఎకరాల తమ పంట పొలాలు బీడుగా మారుతున్నాయని హైలెవెల్ కెనాల్ నిర్మించి పంటలకు నీరందేలా చూడాలని రైతులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. స్పందించిన ఆయన హైలెవల్ కెనాల్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. గత ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల పేరుతో తమభూములు లాక్కుతుందని, తమ భూములు తమకు వచ్చేలా చూడాలని ఎమ్మెల్యేకు పలువురు రైతులు విన్నవించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, పోడేటి రవి, మాజీ సర్పంచు రాంరెడ్డి, లక్ష్మణ్, మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అమర్‌సింగ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిది

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 3 : బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. కమిషనరేట్‌లోని పెద్దపల్లి జిల్లా పరిధిలో బాలురు-33 మంది, బాలికలు- ఏడుగురు, మంచిర్యాల జిల్లా పరిధిలో బాలురు-23మంది, బాలికలు ఏడుగురు, మొత్తం 70 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించామని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కోసం కృషి చేసిన అధికారులను, సిబ్బందిని సీపీ అభినందించారు.

మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కేసులు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 3: ఎవరైనా మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లయితే కేసులు నమోదు చేస్తామని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.. యువతులను, మహిళలను ఎవరైనా ఈవ్‌టీజింగ్ చేసినట్లయితే వెంటనే షీటీమ్స్‌ను ఆశ్రయించాలని సూచించారు. కమిషనరేట్ పరిధిలో రెండు షీటీమ్ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. జూలై నెలలో ఎనిమిది ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్లకు తదుపరి విచారణ నిమిత్తం అప్పగించగా, మిగితా 5 పిటీషన్లలో తల్లితండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించామని ఆయన వెల్లడించారు. స్కూల్, కాలేజీలలో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, టీ సేఫ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివాహాలు, వరకట్నం చట్టాలపై, నూతన మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. . మహిళలు, విద్యార్థిను అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేసి సహాయం పొందాలని ఆయన సూచించారు.

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పిచ్చిమొక్కలను తొలగించిన సిబ్బంది



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మందమర్రిటౌన్, ఆగస్టు 3: పట్టణంలోని రెండో జోన్ లోని సరస్వతి శిశుమందిర్ ఏరియా కాలనీలో పారిశుద్య సిబ్బంది శనివారం పిచ్చి మొక్కలను తొల గించారు. ఈ నెల 1న 'అపరిశుభ్రంగా కాలనీలు' కథ నం 'ఆంధ్రజ్యోతి' టాబ్లాయిడ్‌తో ప్రచురితమైంది. అధికారులు స్పందించి డ్రైనేజీల్లో దోమల నివారణ మందును పిచికారి చేశారు.

ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 3: వివిధ రకాల భూ సమస్యల పరిష్కారం కోసం ధరణి పోర్టల్ ద్వారా ప్రజలు చేసుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్‌మిట్టల్ అన్నారు. హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా శనివారం జిల్లా కలెక్టర్, అదనపు కలె క్టర్, ఆర్డీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చేసుకున్న దరఖాస్తులను నిబంధనల మేరకు రెవెన్యూ రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో భౌతికంగా పరిశీలించి పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాల న్నారు. ధ్రువపత్రాలను పరిశీలించి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో భూ సమస్యల పరిష్కరం కోసం ధరణి పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులను పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతు న్నామని తెలిపారు. ఈ నెల 2వ తేదీ నాటికి 3,988 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం ఎల్‌ఆర్‌ఎస్ 2020 ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క అన్నారు. శనివారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్‌కు అందిన దరకాస్తులను పరిశీలించి ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది కొరత ఉంటే ఇతర ప్రభుత్వ శాఖల నుంచి అర్హత గల వారిని సర్దుబాటు చేసుకోవాలని చెప్పారు. కలెక్టర్ రాండమ్‌గా కొన్ని దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకంపై ప్రభుత్వం చేపడుతున్న పరిశీలన ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్‌లో అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు.

గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు



గుండాలకు కాలినడక వెళుతున్న నాయకులు, అధికారులు

దండేపల్లి, ఆగస్టు 3: గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గిరిజన ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. దండేపల్లి మండలం ఊట్ల అటవీ ప్రాంతం నుంచి కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండల గుండాల వరకు గతంలో నిర్మించిన రోడ్డు దెబ్బతినడంతో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆదేశాల మేరకు శనివారం గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్, గిరిజన సంఘాల నాయకులు, నాయకులు ఐటీడీఏ అధికారులతో కలిసి ఊట్ల నుంచి గుండాల వరకు ఎనిమిది కిలోమీటర్లు కాలినడక వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా గుండాల గిరిజనులు ఛైర్మన్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గిరిజనులతో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం గుండాల నుంచి దండేపల్లి మండలానికి ఆదివాసీ గిరిజనులు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. రోడ్డు దెబ్బతినడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వానికి నివేదించి మరమ్మతుల కోసం నిధుల మంజూరుకు తనవంతు కృషి చేస్తాన్నాని గిరిజనులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ మునిమడుగుల శంకర్, డీఈ షాహబాజ్ అహ్మద్, ఐటీడీఏ ఏఈ రామకృష్ణ, భీంరావ్, గిరిజన సంఘాల నాయకులు సోము, శ్రీనివాస్, జంగు, లింగారావు, నాయకులు సతీష్, రవి, మోహన్, తిరుపతి, గుండాల గ్రామ నాయకులు మోతీరాం, దౌలత్‌రావు, అశోక్, సోనేరావు, బాలకిషన్, అర్జున్, ఏఎస్సై రాజేందర్ పాల్గొన్నారు.

ఏఎన్ఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా రాజేశ్వరి నియమాకం

దండేపల్లి, ఆగస్టు 3: ఆదివాసీ నాయక్ పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ నూతన రాష్ట్ర ఉపాధ్య క్షురాలిగా కర్ణపేట తాజా మాజీ సర్పంచు మారినేని రాజేశ్వరి నియమాకం అయ్యారు. ఈ మేరకు శని వారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న రాజేశ్వరికి నియమాక పత్రాన్ని అందజేశారు.

స్త్రీ నిధి రుణాల అవకతవకలపై ఆర్ఎం విచారణ

దండేపల్లి, ఆగస్టు 3: దండేపల్లి మండలం మ్యాదరిపేటలో దివ్య వీవో గ్రూప్‌లో స్త్రీ నిధి రుణాల వసూళ్లలో జరిగిన అవకతకలపై శనివారం దండేపల్లిలో శ్రీలక్ష్మి మండల సమాఖ్య ఐకేపీ కార్యలయంలో స్త్రీ నిధి ఆర్ఎం వెంకటరమణ విచారణ చేపట్టారు. వీవో పరిధిలోని 103 మంది సభ్యులు రూ. 55లక్షల వరకు స్త్రీ నిధి నుంచి రుణాలు పొందారు. ఈ రుణాలు తీసుకున్న వారిలో కొందరు వాయిదాల పద్ధతిలో డబ్బులు చెల్లింపులు చేస్తున్నారు. మరికొందరు రుణాలను సరిగా కట్టడం లేదు. దీంతో రుణాలు చెల్లించిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నాయి. మరి కొందరు చెల్లించని విషయం కొందరు ఏపీఎం బ్రహ్మయ్య దృష్టికి తీసుకవచ్చారు. స్త్రీ నిధి ఆర్ఎంకు ఏపీఎం విషయం తెలియజేశారు. దీంతో స్త్రీ నిధి ఆర్ఎం స్థానిక కార్యాలయం, మ్యాదరిపేట వీవోలతో విచారణ జరిపించారు. త్వరలో వీవోలతో సమావేశం ఏర్పాటు చేసి. తీసుకున్న రుణాలు చెల్లించని వారి నుంచి రికవరీ చేయాలని ఆయన ఆదేశించారు. ఇలాంటి అవకతవకలు మళ్లీపునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాల న్నారు. తీసుకున్న రుణాలు చెల్లించకపోతే వారిపై శాఖ పరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంఘా ఆయన తెలిపారు. ఆయన వెంట మండల సమాఖ్య అధ్యక్షురాలు అల్లంల అనిత, స్త్రీ నిధి అసిస్టెంట్ మేనేజర్ సితార, సిబ్బంది ఉన్నారు.

నేడు ఆదిపరాశక్తి మాత బోనాల జాతర

నస్పూర్, ఆగస్టు 3: నస్పూర్ పట్టణం సీసీసీ కార్నర్ రాంనగర్‌లోని ఆదిపరా శక్తి భువనేశ్వరి మాత ఆలయం ఆషాడ మాస బోనాల జాతర ఆదివారం నిర్వహించను న్నామని జాతర నిర్వహకులు వంగల దయానంద్, వంగల వివేకానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సీసీసీ కార్నర్ నుంచి సాముహిక బోనాల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

దండేపల్లి, ఆగస్టు 3: అర్హులైన రైతులు రైతు బీమా పథకం కోసం సోమవారంలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి గొర్ల అంజిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. కొత్తగా పట్టాదారు పుస్తకాలు పొందిన వారు అందజేయాలని కోరారు.

'సంక్షేమ పథకాలు మంజూరు చేయాలి'

సిర్పూర్(యు), ఆగస్టు 3: మండలంలోని బండేయేర్ గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజనగ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమపథకాలు మంజూరు చేయాలని మండల వీటీడీఏచైర్మన్ కుమ్ర భీంరావు ఉన్నతఅధికారులకు వినతి పత్రాలు అందించారు. శనివారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమశాఖ ప్రభుత్వకార్యదర్శిని కలిసి బండేయేర్‌లో ఆశ్రమపాఠశాల ఏర్పాటు, రుద్రకాస నుంచి బండేయేర్ వరకు బీటీరోడ్డు, బండేయేర్ నుంచి కుండాయ్ జలపాతం వరకు బీటీరోడ్లు మంజూరుచేయాలని వినతిపత్రం అందించారు. అదే విధంగా అటవీహక్కు భూముల్లో బోరు, బావులు తవ్వడానికి అనుమతి ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్టర్‌ను కోరారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులకు బండేయేర్ గ్రామపంచాయతీ పరిధిలోని మూంజీగూడలో ఆలయనిర్మాణం కోసం వినతిపత్రం అందించామన్నారు. అదేవిధంగా బండేయేర్, మూంజీగూడలో అభివృద్ధి పనులు మంజూరు చేయాలనికోరగా ఆయాశాఖల ఉన్నతాధికారులు సానుకులంగా స్పందించారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు లక్ష్మణ్, ఆత్రం భీంరావు, కొడప భీంరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో చోరీకి యత్నం


పోలీసులు అదుపులో అల్లకొండ రమేష్


బ్యాంకును పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణాకర్

దహెగాం, ఆగస్టు 3: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో దొంగలు చోరీకి యత్నించారు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం 7గంటలకు బ్యాంకు సిబ్బంది తాళాలువేసి వెళ్లరు. రాత్రి ఒంటి గంట సమయంలో శబ్దాలు రావడంతో బ్యాంకు ఉన్న ఇంటి యాజమాని మేనేజర్‌కు సమాచారం అందించారు. రాత్రి 1.30గంటకు మేనేజర్, సిబ్బంది చేరుకునే సరికి తలుపులు పగుల గొట్టి ఉన్నాయి. ఉదయం సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు బ్యాంకులోకి చొరబడింది చిన్నవినంకు చెందిన అల్లం కొండ రమేష్‌గా గుర్తించి అదుపులోకి తీసుకొన్నారు. విచారణ జరుపుతున్నామని, బ్యాంకుమేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ కరుణాకర్ పరిశీలించారు.

తల్లి పాలతోనే శిశువుకు ఆరోగ్యం

- జీజీహెచ్ సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 3: తల్లి పాలతోనే శిశువుకు ఆరోగ్యం అని జీజీహెచ్(ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి) సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రారెడ్డి అన్నారు. మంచిర్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మతాశిశు ఆసుపత్రిలో శనివారం తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రారెడ్డి, డిప్యూటీ ఆర్‌ఎంవో శ్రీధర్, ప్రొఫెసర్లు డాక్టర్ వేదవ్యాస్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ బిడ్డను ప్రసవించిన తల్లి మొదటి మూడు రోజులు ఇచ్చే పాలు అమృతంతో సమానమని, ఆ పాలు బిడ్డకు చాలా శ్రేయస్కరమని అన్నారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శి చంద్రమౌళి, ప్రోగ్రాం చైర్‌పర్సన్ వి.మధుసూదన్ రెడ్డి, వినయ్‌కుమార్, గోళి రాము పాల్గొన్నారు.

దండేపల్లి: తల్లి పాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యమని లక్షెట్టిపేట ఐసీడీఎస్ సీడీపీవో ప్రాజెక్టు అధికారిణి రేష్మ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో దండేపల్లి మండల నెల్కివెంకటాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలోని శనివారం తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దండేపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ మనస్విని, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఏసీసీ: జిల్లా కేంద్రంలోని ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ పద్మ తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వమించారు. కార్యక్రమంలో కేంద్రం సహాయకురాలు లత, తల్లులు పాల్గొన్నారు.

జన్నారం: పుట్టిన పిల్లలకు ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ సూచించారు. మండలంలోని తిమ్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సంజీవరాణి, ఆయా మమత పాల్గొన్నారు.

హాజీపూర్: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని సీడీపీవో విజయలక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీలత అన్నారు. మండలంలోని పెద్దంపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు, గర్భిణులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పోషన్ అభియాన్ సతీష్, అంగన్‌వాడీ టీచర్లు వసుంధర, నాగలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి రూపదేవి తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: ఎర్రగుంటపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని పిల్లలకు అన్నప్రాసన చేయించారు. కార్యక్ర మంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ పాల్గొన్నారు.

జైపూర్: జైపూర్, ఇందారం 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు మద్దుల సరిత, గడ్డం సౌజన్య, నళిని పిల్లలకు అన్న ప్రాసన చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుమతి తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ముర్రుపాల వల్ల శిశువులు ఆరోగ్యంగా ఎదుగుతారని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. ఆల్గామ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చిన్నక్క, వెంకటలక్ష్మీ, జనగామ , నంద రాంపల్లి, వెంచపల్లి అంగన్‌వాడీ టీచర్లు దీప, సుమలత, సవిత పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్షెట్టిపేటరూరల్, ఆగస్టు 3 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పిలుపునిచ్చారు. లక్షెట్టిపేట పట్టణంలోని విశ్రాంతి భవనం ఆవరణలో శనివారం మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం బీఆర్‌ఎస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తిప్పని లింగయ్య, చుంచు చిన్నయ్య, కాంతయ్య, ఆసాధి పురుషోత్తం, శ్రీనివాస్, రవీందర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణకు మూడు దశాబ్దాల పోరాటం'

జన్నారం, ఆగస్టు 3: మూడు దశాబ్దాల పోరాట ఫలితాలే ఎస్సీ వర్గీకరణ అని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండుకూరి రాజు అన్నారు. మండలంలోని చింతగూడ గ్రామంలో శనివారం విజయోత్సవ వేడుకలను నిర్వహిం చారు. అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగం, నాయకులు ప్రశాంత్, అశోక్, లక్ష్మీరాజం, సురేష్, ప్రదీప్, సత్తయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం- పచ్చదనం'పై అవగాహన

బెల్లంపల్లి, ఆగస్టు 3: మున్సిపాలిటీలో సోమవారం నుంచి 9వతేదీ వరకు నిర్వహిం చే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అవ గాహన కల్పించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిలర్లు, ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పారిశుధ్య పనులను చేపట్టాలని, మొక్కలను నాటాలని సూచించారు. అధికారులందరు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గెల్లి రాజలింగు, మున్సిపల్ మేనేజర్ చిట్టిబాబు, రెవెన్యూ ఆఫీసర్ ప్రవీణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సంతోష్, టీఎంసీ దుర్గయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: క్యాతన్‌పల్లి మున్సిపల్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కల అన్నారు. క్యాతన్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన సమావేశం సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం విడతల వారీగా ఈ నెల 5 నుంచి 9 వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనుందన్నారు. అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్ర మాలను విజవయంతం చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ మా ట్లాడుతూ ప్రభుత్వం చేపట్టనున్న కార్యక్రమాలకు అన్నిశాఖల అధికారులు అందు బాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ విద్యాసాగర్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ స్వామి, రెవెన్యూ ఆఫీసర్ సతీష్, మెడికల్ ఆఫీసర్ మానస, సీడీపీవో విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ కుమార్, అధికారులు శ్రీధర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో శనివారం స్వచ్ఛ దనం-పచ్చ దనం కార్యక్ర మంపై మండల ఇన్‌చార్జీ ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి గ్రామ ప్రత్యేకా ధికారులు, పంచాయతీ కార్యదర్శు లకు అవగాహన కల్పించారు. సోమవారం నుంచి 9వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు.

బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం

మందమర్రిటౌన్, ఆగస్టు 3: బెల్లంపల్లి పట్టణంలో శనివారం బీజేపీ మందమర్రి పట్టణ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఆరుముళ్ల పోశం, ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్‌లు పాల్గొన్నారు. సమావేశంలో రాజమల్లు, దీక్షితులు, రాజమల్లు, దుర్గరాజు,నరేష్, పార్వతి, స్వప్న, శ్రీనివాస్, కిష్టయ్య, రమేష్, వినోద్, మంగ, ప్రియాంక, ప్రవళిక, శ్రీనివాస్, గణపతి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

వేమనపల్లి, ఆగస్టు 3: మండలంలోని పలువురికి శనివారం మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ ఆలీ సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. చల్ల రామక్కకు రూ. 60 వేలు, దొంతుల స్వామికి రూ. 16 వేలు, ఆలం మల్లేష్‌కు రూ. 9 వేలు, స్వరూపకు రూ. 6,500ల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు గాలి మధు, నాయకులు రాజన్న, రాంచందర్, సత్యనారాయణ, జగన్,మల్లయ్య, తులసీరామ్, జలపతిరావు, శ్రీశైలం, గణేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

జన్నారం, ఆగస్టు 3: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ రాజవర్ధన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోనిపోలీస్‌స్టేషన్ సమీపంలో యువకుల చేత ప్లకార్డులు ప్రదర్శింపజేసి అవగాహన కల్పించారు.

రేచిని కార్యదర్శిపై డీపీవోకు ఫిర్యాదు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 3: తాండూర్ మండలంలోని రేచిని గ్రామపంచా యతీ కార్యదర్శి శ్రీనివాస్‌పై రేచిని గ్రామానికి చెందిన రమాదేవి శనివారం జిల్లాపంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేసింది. తన ఇంటి ఆవరణలో వాహనం వెళ్లేందుకు ర్యాంపు నిర్మించుకున్న విషయంలో అనుమతి లేదని నోటీసులు జారీ చేశారని, అడిగినన్ని డబ్బులు ఇవ్వకపోవడంతో ర్యాంపును కూల్చివేశారని తెలిపింది. ర్యాంపు విషయంలో కార్యదర్శి బెదిరింపులకు గురి చేయడంతో రూ. 20 వేలు ఇచ్చానని, అయినా మరో రూ. 10 వేలు కావాలని డిమాండ్ చేయడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. డబ్బులు ఇచ్చిన విషయం ఎవరికైనా చెబితే క్రిమినల్ కేసులు బుక్‌చేపిస్తానని కార్యదర్శి బెదిరిస్తున్నాడని డీపీవో దృష్టికి తీసుకువెళ్లామని తెలిపింది.

ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్, ఆగస్టు 3: ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు మందమర్రి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ దేవానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. విద్యార్థులు ఈ నెల 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా బోనాలు


మందమర్రిలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

మందమర్రిటౌన్, ఆగస్టు 3: పట్టణంలోని కేకే 1 సీఎస్పీలోని దుర్గా భవానీ మాత ఆషాడ మాస బోనాల మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వ రాలయంలో పూజలు చేసి మహిళలు నెత్తినబోనాలు పెట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కోల్‌బెల్ట్‌రోడ్డు మీదుగా భవానీ మాత ఆలయం వరకు కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: తవక్కుల్ విద్యాసంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో శనివారం బోనాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు బోనాలను నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అదృశ్యమైన తాపీ మేస్త్రి మృతి

కాగజ్‌నగర్, ఆగస్టు 3: సర్‌సిల్క్ కాలనికి చెందిన తాపీ మేస్త్రీ ప్రభాకర్(65) గతనెల 28న అదృశ్యం కాగా, శనివారం కోయవాగు బ్రిడ్జి వద్ద అతని మృతదేహం కనిపించినట్టు ఎస్సై అంజన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోయవాగు బ్రిడ్జి వద్ద మృతదేహం తేలుతున్నట్టు కాలనీవాసులు సమాచారం అందించినట్టు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించగా మృతదేహం ప్రభాకర్‌దిగా గుర్తించినట్టు తెలిపారు. మృతిడికి భార్య పార్వతమ్మ, ఇద్దరు పిల్లలున్నట్టు తెలిపారు. కాగా మృతి చెందిన ప్రభాకర్ మూర్ఛవ్యాధితో బాధపడుతున్నా డని, ఒక నెల నుంచి మతిస్థిమితం సరిగా లేక తిరుగుతున్నట్టు ఎస్సై తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

దండేపల్లి,ఆగస్టు 3: దండేపల్లి మండలం నాగసముద్రంలో భార్య కాపురానికి రావడం లేదని భర్త ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగసముద్రం గ్రామానికి చెందిన ఈర్ల అశోక్(34)అనే వ్యక్తికి ఏడేళ్ల క్రితం నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన ఈర్ల గంగసోనితో వివాహం జరిగింది. వీరికి కుమారుడు(5) ఉన్నాడు. అనంతరం దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో ఐదేళ్ల క్రితమే అశోక్‌ను వదిలేసి ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో అతను మద్యానికి అలవాటు పడ్డాడు. నాలుగు రోజుల నుంచి తన భార్య కాపురానికి రావడం లేదని, తన కొడుకును చూడాలని కుటుంబసభ్యులతో చెబుతూ బాధ పడుతున్నాడు. దీంతో శనివారం జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అశోక్ తల్లి ఈర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో విద్యార్థినికి గాయాలు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 3: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న వైష్ణవి అనే విద్యార్థిని విద్యుత్‌షాక్‌కు గురవడంతో గాయాలయ్యాయి. వెంటనే ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఐబీ చౌరస్తా సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని సమాచారం. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు సంప్రదించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 3: విద్యార్థులు డ్రగ్స్, గంజాయి , చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. రేచిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు అలవాటు పడితేజీవితాలు నాశనం అవుతాయన్నారు. విద్యార్థులు భారత ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలోఎస్‌ఐ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కన్నెపల్లి : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ గంగారాం సూచించారు. కన్నెపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ప్రహరీ కమిటీ (యాంటీడ్రగ్స్) కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు రమేశ్ , 6 నుంచి పదో తరగతి వరకు ఇద్దరు చొప్పున 10 మంది విద్యాంస్థలను, ఉపాధ్యాయురాలు సువర్ణను కమిటీ సభ్యులుగా నియమించారు.

స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐది ప్రత్యేక పాత్ర

శ్రీరాంపూర్, ఆగస్టు 3 : స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ ప్రముఖ పాత్ర పోషించిం దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. స్థానికంగా శనివారం నిర్వహిం చిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ ఏర్పాటై వందేళ్లు కావస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు రేగుంట చంద్రశేఖర్, జిల్లా సమితి సభ్యులు చిలుక రాంచందర్, సంఘం సదానందం, నాయకులు సారంగపాణి, మహేష్, రాకేష్, శంకర్, సదానందం, బాలస్వామి, లక్ష్మణ్, దుర్గయ్య, రాజ్ కుమార్ పాల్గొన్నారు. కాగా సీపీఐ మండల నిర్మాణ కౌన్సిల్ మహాసభను ఆదివారం నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ కార్యదర్శి రామన్న తెలిపారు.


సిర్పూరు(టి)లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మ


వాంకిడిలో మాట్లాడుతున్న హెచ్‌ఈవో రవిదాస్


తల్లి పాలు పిల్లలకు ఎంతో శ్రేష్ఠం

సిర్పూరు(టి), ఆగస్టు 3: తల్లి పాలు పిల్లలకు ఎంతో శ్రేష్ఠమని సిర్పూరు(టి) ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డలకు తల్లి ముర్రుపాలు పట్టించాలన్నారు. దీంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహార, పోషక పదార్థాలపై వివరించారు. సమావేశంలో టీచర్లు అర్చన, ఉమాదేవి, తల్లులున్నారు.

బెజ్జూరు: మండల కేంద్రంలోని నాల్గవ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలు పట్టించినట్లయితే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు స్వప్న, లలిత. తిరుపతమ్మ, రమాశ్రీ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని కోమటిగుడ హెచ్‌ఈవో రవిదాస్ మాట్లాడుతూ అప్పుడే పుట్టినబిడ్డకు ఒక గంటలోపు ముర్రుపాలు తాగించడంవల్ల వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందన్నారు. పిల్లల్లో జ్ఞాపకశక్తి, చురుకుదనం అధికంగా ఉంటుందన్నారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడంవల్ల గర్భాశయ, రొమ్ముక్యాన్సర్, అధిక బరువు రాకుండా కాపాడుతాయని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సునీత, ఎంఎల్‌హెచ్‌పీ రేణుక, కార్యదర్శిసుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆకుబాయ్, యమున, చంద్రకళ, నందిని, కౌసల్య పాల్గొన్నారు.

జైనూర్: అప్పుడే పుట్టినబిడ్డకు తల్లి పాలు టీకా లాంటిదని జైనూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఇందిర అన్నారు. మండలంలోని భుసిమెట్ట, జైనూర్‌లోని శాంతినగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ముర్రుపాలు చిన్నారులకు వ్యాధినిరోధక శక్తినిస్తాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సోంబాయి, సుజాత, అంగన్‌వాడిటీచర్లు అనసూయ, గోదావరి, అమృత,ఆశవర్కర్లు,తల్లులు పాల్గొన్నారు.


బెజ్జూరులో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్


జైనూర్‌లో మాట్లాడుతున్న సీడీపీవో ఇందిర

ప్రారంభానికి నోచుకోని ఆక్సిజన్ ప్లాంటు

● పట్టించుకోని పాలకులు, అధికారులు

సిర్పూర్(టి), ఆగస్టు 3:మండల కేంద్రంలోని 30పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వం అత్య వసరసేవల్లో రోగులకు తక్షణమే ఆక్సిజన్ అందించాలన్న లక్ష్యంతో కోటిరూపాయలతో ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. ఈ నిర్మాణ పనులు పూర్తై ఏడాది గడిచినా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో నిరుపయోగంగా ప్లాంటు నిరుపయోగంగా మారింది. ప్లాంట్‌లో అమర్చిన కొన్ని సూక్ష్మపరికరాలు చెడిపోయాయని సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా వైద్య విధానపరిషత్ అధికారులు, ఆసుపత్రి సలహా సంఘం, ఎమ్మెల్యే స్పందించి ఆక్సిజన్ తయారీ కేంద్రంను ప్రారంభించేలా కృషిచేయాలని ప్రజలు, రోగులు కోరుతున్నారు. అదే విధగా ఇదే ఆసుపత్రిలో గత సంవత్సరం మంజూరైన డిజిటల్‌ఎక్స్‌రే యంత్రంకు కూడా ప్రారంభానికి నోచుకోవడం లేదు.

ప్రత్యేక మినీ ట్రాన్స్‌ఫార్మర్ అవసరం

- సునీల్, జూనియర్ అసిస్టెంట్

ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన ఆక్సిజన్ తయారీ కేంద్రం నిర్మాణం పూర్తై అయి వృథాగా ఉన్న విషయం వాస్తవమే. దీనికి ప్రత్యేక మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు అవసరం. అది లేకపోవడంతోనే ప్రారంభించ లేదు. మినీ ట్రాన్స్‌ఫార్మన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే ఆక్సిజన్ తయారీకేంద్రం ప్లాంటును ప్రారంభించడానికి కృషి చేస్తాం.


ఆక్సిజన్ ప్లాంటు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
ఆదివారం 4 ఆగస్టు 2024



బడిలో పరిశుభ్రతేది?



- స్వీపర్లు, స్కావెంజర్లు లేక అవస్థలు
- పాఠశాలల్లో పరిశుభ్రత కరువు
- కంపుకొడుతున్న మూత్రశాలలు, మరుగుదొడ్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పట్టించుకోని అధికారులు, పంచాయతీలు

పాఠశాల.. అదో చదువుల దేవాలయం..నిత్యం అక్కడకు వచ్చే విద్యార్థులకు ఆహ్లాదకర, పరిశుభ్రత వాతావరణం తప్పనిసరి. కానీ జిల్లాలోని పాఠశాలల్లో స్వీపర్లు, స్కావెంజర్లు లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకపోవడంతో అపరిశుభ్ర వాతావరణంలోనే విద్యార్థులు తరగతులకు హాజరు కావాల్సిన దుస్థితి నెలకొంది. తప్పని పరిస్థితుల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులే శుభ్రం చేయాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.

- బెజ్జూరు

జిల్లా అధికారులు పాఠశాలల్లో పారిశుధ్య, పరిశుభ్రత మెరుగ్గా తీర్చిదిద్దాలని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ అసలు పాఠశాలల్లో స్కావెంజర్లు, స్వీపర్లు లేరనే విషయాన్ని మర్చిపోతున్నారు. పాఠశాలలను సందర్శించిన అధికారులకు స్కావెంజర్లు, స్వీపర్లు లేరనే విషయాన్ని తెలియజేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పట్లో పాఠశాలల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే కేవలం కొన్ని ఉన్నత పాఠశాలల్లో మాత్రమే అడపాదడపా ఊడ్చేవారు.

ప్రస్తుతం ఏ ఒక్క పాఠశాలలోనూ శుభ్రం చేయడం లేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమాలు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులతో చేయించాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కానీ వారు గ్రామపంచాయతీ పరిధిలోని రోడ్ల శుభ్రత, ఇతర పనుల్లో బిజీగా ఉంటున్నారు. జిల్లాలోని కొన్ని ఉన్నత పాఠశాలల్లో మాత్రమే గ్రామ పంచాయతీ కార్మికులు పాఠశాలలను శుభ్రం చేస్తుండగా ప్రాథమిక పాఠశాలల్లో మాత్రం విస్మరిస్తున్నారు.

పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం పూర్తి కావడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగడం వారు చుట్టపు చూపుగా హాజరు కావడంతో ఎక్కడి సమ స్యలు అక్కడే నెలకొన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పాఠశాలల్లోని ఆవరణలోకి పశువులు వచ్చి అపరిశుభ్రంగా మారుస్తున్నాయని వాపోతున్నారు. వర్షం కురిసినప్పుడల్లా వదిలేసిన పశువులు ఎక్కడ పడితే అక్కడ తిరుగుతూ పేడ వేస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నా యని ఉపాధ్యాయులు వాపోతున్నారు. మరోవైపు మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం ద్వారా పాఠశాలల్లో స్కావెంజర్లు, స్వీపర్లు నియమించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాలలు ఊడ్చేలా చర్యలు తీసుకుంటాం..

రమేష్‌బాబు, ఎంఈవో, బెజ్జూరు

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లు, స్వీపర్లు లేని మాట వాస్తవమే. లేనిచోట గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులే శుభ్రం చేయాలి. అయితే కొన్ని చోట్ల శుభ్రం చేయడం లేదని మా దృష్టికి వచ్చింది. ఇక నుంచి వారితో పాఠశాలల్లో పరిశుభ్ర కార్యక్రమాలు చేయించేలా చూస్తాం.

జిల్లా అంతా ఇదే పరిస్థితి..

జిల్లాలో మొత్తం 560ప్రాథమిక పాఠశాలలు, 102ప్రాథమికోన్నత పాఠశాలలు, 58జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం720 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో స్కావెంజర్లు, స్వీపర్లు లేకపోవడంతో పరిశుభ్రత సమస్య జఠిలంగా మారింది. పాఠశాలల్లో పరిశుభ్రతతో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రత చేయాల్సి ఉంటుంది. విద్యార్థులు ప్రతి రోజు వాటిని వినియోగిస్తుంటారు. కానీ అవి పరిశుభ్రంగా లేక విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యార్థినులకు మాత్రం ఈ విషయంలో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. అయినా అధికారులు ఈ సమస్యను పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. ఇప్పటికే వర్షాకాలం ప్రారంభమవగా పాఠశాలల ఆవరణలు అపరిశుభ్రంగా మారి దోమలు వ్యాప్తి చెంది విద్యార్థులు జ్వరాల బారిన పడే అవకాశం ఉన్నందున వీలైనంత త్వరగా స్వీపర్లు, స్కావెంజర్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



బెజ్జూర్ మండలంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు

విధుల్లోకి తీసుకోవాలని నిరసన



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై అంజన్న

కాగజ్‌నగర్, ఆగస్టు 3: కాగజ్‌నగర్‌లో ఎయిడ్స్ ప్రాజెక్టులో పనిచేస్తున్న సిబ్బందిని తిరిగివిధుల్లోకి తీసుకోవాలని శనివారం కాగజ్‌నగర్ ఎయిడ్స్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట గతంలో పనిచేసిన సిబ్బంది నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాగజ్‌నగర్‌లోని శ్రీసాయి మహిళ మండలి ఎయిడ్స్ ప్రాజెక్టులో కొన్ని సంవత్సరాలుగా తాము విధులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పలు కారణాలవల్ల ఈ ప్రాజెక్టు ఇతరులకు మార్పు చేశారన్నారు. అయితే శ్రీసాయి మహిళమండలి ఎయిడ్స్ ప్రాజెక్టులోని సిబ్బందిని తీసుకోలేదన్నారు. ఎస్సీ కులస్థులమని తమను పక్కన పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై అంజన్న సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. న్యాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. నిరసన కార్యక్రమంలో సిబ్బంది ఇంద్రజ, ఆమని, సునంద తదితరులు పాల్గొన్నారు.

వెజిటబుల్ మార్కెట్ దుకాణాల బంద్



నిర్మానుష్యంగా మారిన వెజిటబుల్ మార్కెట్

కాగజ్‌నగర్, ఆగస్టు 3: కాగజ్‌నగర్‌లో వెజిటబుల్ మార్కెట్ దుకాణదారులు శనివారం బంద్ పాటించారు. మార్కెట్‌లోని వ్యాపారి గణేష్ గుండె పోటుతో మృతిచెందటంతో కమిటీసభ్యులు శనివారంబంద్ పాటించాలని తీర్మాణించారు. దీంతో శనివారం చిరువ్యాపారులు, కూరగాయాల దుకాణాల యాజమానులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెజిటబుల్ మార్కెట్ కమిటీ సంఘం నాయకులు మాట్లాడుతూ వ్యాపారి గణేష్ మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలింత మృతి



రజిత(ఫైల్)

తిర్యాణి, ఆగస్టు 3: మండలంలోని గోయగాం గ్రామానికి చెందిన గిరిజన బాలింతరాలు గంధం రజిత(30)ను శనివారం వరంగల్ నుంచి కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గోయగాం గ్రామానికి చెందిన బాలింత గంధం రజిత జూలై4 తర్వాత ప్రసవానంతరం నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోచికిత్స పొందుతోంది. వైద్యులసూచన మేరకు మెరుగైన వైద్యంకోసం ఆమెను వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా రజితకు మెదడులో రక్తం గడ్డకట్టినట్టు అక్కడి వైద్యులు నిర్ధారించారు. ఆపరేషన్‌కు సరిపడాడబ్బులు లేకపోవడంతో రజిత కుటుంబ సభ్యులు ఆమెను కరీంనగర్‌కు తీసుకొచ్చేందుకు నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో వరంగల్ నుంచి కరీంనగర్‌కు వస్తుండగా మార్గమధ్యలో రజిత మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

సిర్పూరు(టి), ఆగస్టు 3: మండలకేంద్రంలోని ఆరెగూడ రైల్వేట్రాక్ వద్ద పట్టాలు దాటుతుండగా శనివారం చండీఘడ్-మధురై రైలు ఢీకొని ఒకరు మృతి చెందినట్టు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెగూడ ట్రాక్ వద్ద అచ్చెలి గ్రామానికి చెందిన గొల్ల భీం రావు(45) పట్టాలు దాటుతుండగా చండీఘడ్- మధురై రైలు ఢీకొట్టడంతో అకక్కడిక్కడే మృతిచెందా డన్నారు. ఈ మేరకు భీంరావు మృతదేహాన్ని సిర్పూరు(టి) సివిలాసుపత్రికి తరలించినట్టు వివరించారు. ఈ మేరకు గొల్ల భీంరావు కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మండల పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం

లింగాపూర్, ఆగస్టు 3: మండల పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని శనివారం మండలంలోని లింగాపూర్ గ్రామపంచాయతి కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా రజనీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా యాదవ్‌ప్రేమ్‌సింగ్, ప్రధానకార్యదర్శిగా పాపయ్య, ట్రెజరీగా జగదీష్, సహాయ కార్యదర్శిగా భీంరావ్, సలహాదారులుగా శ్రీనివాస్, బారిక్‌రావు, సాగర్ కిరణ్, అంబాజీరావును ఎన్నుకున్నారు.

వర్షానికి కూలిపోయిన గోడ

సిర్పూరు(టి), ఆగస్టు 3: కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలకేంద్రానికి చెందిన దాసరి కళావతి-వినోద్‌కు చెందిన ఇంటిలోని వంటగది గోడ శుక్రవారం రాత్రి కూలిపోయింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. వంటగది సామాగ్రి ధ్వంసమైంది. బాధితులు శనివారం సిర్పూరు(టి) తహసీల్దార్‌కు పరిహారం అందించాలని వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సంఘటన స్థలాన్ని ఆర్‌ఐ జుగాడిరావు, జూనియర్ అసిస్టెంట్ ఇమ్రాన్ పరిశీలించి వివరాలు సేకరించారు.

గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్, ఆగస్టు 3: ఉమ్మడి ఆదిలాబాద్‌లోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు డాక్టర్ రెడ్డిస్ ల్యాబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తామని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, కరీంనగర్‌లలోని డాక్టర్ రెడ్డిస్‌ల్యాబ్ శిక్షణ కేంద్రంలో మూడునెలల పాటు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేం దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలక్ట్రికల్/మెకానికల్‌లలో ఐటీఐ/డిప్లొమా, బీసీఏ, బీఎస్సీ విద్యాఅర్హత కలిగిన 18-28సంవత్సరాల గల వారికి వివిధకోర్సుల్లో 3నెలలపాటు ఉచితశిక్షణ అందిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హతగల గిరిజన నిరుద్యోగ యువత తమ ధ్రువపత్రాలతో ఈనెల 5 నుంచి 10లోగా ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 9010295910, 9666748105, 9493535052లకు సంప్రదించాలన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న గంట గోపాల్

సిర్పూరు(టి), ఆగస్టు 3: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఆదివాసీ మన్నెవార్ సంఘం అధ్యక్షుడు గంట గోపాల్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఆయన మాట్లాడారు. అన్నిగూడేల్లో ఆది వాసీ జెండాలు ఎగురవేయాలన్నారు. 9న సిర్పూర్(టి)లోని గిరిజన ఆశ్రమ పాఠశాల వద్ద గల కుమరం భీం విగ్రహం వద్ద ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు సుర్పం అర్జు, గెడెం నగేష్, సుర్పం రాంషా, భగవంత్‌రావు, వెడ్మ భీంరావు, మారు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రె

ఆసిఫాబాద్, ఆగస్టు 3: ధరణి పోర్టల్‌లో భూ సమస్యల పరిష్కారం కోసం అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్‌లతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ రకాల వివాదాలను పరిష్కరించేం దుకు ధరణిపోర్టల్ ద్వారా కృషి చేస్తామన్నారు. భూ సమస్యలను పరిష్కారం కోసం అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను రెవెన్యూ రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి నివేదికలు రూపొందించాలన్నారు. దరఖాస్తుదారు దరఖాస్తుతోపాటు సమర్పించిన దస్తావేజులు, ధ్రువపత్రాలను పరిశీలించి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ దోత్రె మాట్లాడుతూ జిల్లాలో తహసీల్దార్, ఆర్డీవో, అదనపుకలెక్టర్ల లాగిన్‌లలో మొత్తం 593దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిపై ప్రత్యేక దృష్టిసారించి పదిరోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపుకలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేష్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

లేఅవుట్ క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం 2020 ద్వారా వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ నుంచి రెవెన్యూశాఖ మంత్రి పి శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ నుంచి మున్సిపల్ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్, భూపరిపాలన కమిషనర్ నవీన్‌మిట్టల్ ఇతర కార్యదర్శులతో కలిసి వేర్వేరుగా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లేఅవుట్ ఇండ్లస్థలాల క్రమబద్ధీకరణపై సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం 2020 ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేంకటేష్ దోత్రె మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ 2020లో లేఅవుట్ ఇండ్లస్థలాల క్రమబద్ధీకరణ పథకం ద్వారా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో దరఖాస్తు పరిశీలించి ప్రభుత్వ, ఇరిగేషన్ భూముల రక్షణకు కృషిచేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవోలు లోకేశ్వర్ రావు, సురేష్, డీపీవో భిక్షపతి, మున్సిపల్ కమిషనర్ భుజంగ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో భారీగా అధికారుల బదిలీలు

మందమర్రిటౌన్, ఆగస్టు 3: సింగరేణి భారీగా అధికారుల బదిలీలకు శ్రీకారం చుట్టింది. కొత్తగూడెం కార్పొరేట్ కార్యా లయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీచేసింది. సింగరేణిలోని అన్ని విభా గాల్లో దాదాపు 210మంది అధికారులను బదిలీచేసింది. సర్వే, ఎఫ్అండ్ఏ, పర్సనల్, ఫారెస్టు, ఎక్స్‌ప్లోరేషన్, ఎస్టేట్, మెడికల్‌లలో బదిలీలను చేసింది. నిర్దేశించిన తేదీలోగా బదిలీ అయిన చోట జాయిన్ కావాలని ఆదేశించింది.

విభాగాల వారీగా వివరాలు..

శ్రీరాంపూర్: సింగరేణిలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. శ్రీరాంపూర్ ఎస్టేట్స్ విభాగంలో పనిచేస్తున్న కె స్వప్న మందమర్రికి, రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో అదనపు సీఎంవో(స్పెషలిస్ట్)గా పనిచేస్తున్న డాక్టర్ ఎం ఉష కొత్తగూడెం ప్రధానఆస్పత్రికి, ఈఎం విభాగం హైదరాబాద్‌లోని మార్కెటింగ్, మూవ్‌మెంట్‌లో పనిచేస్తున్న ఎన్‌వీ రాజశేఖర్ ఎస్టీపీపీ జీఎంగా, మందమర్రి ఏరియా ఇంజనీర్‌గా పనిచేస్తున్న అదనపు జీఎం జె నాగరాజు విజయవాడలోని ఆప్‌మెల్ ఎండీగా, ఈఅండ్ఎం విభాగం శ్రీరాంపూర్ ఏరియా స్టోర్స్‌లో డీజీఎంగా పనిచేస్తున్న యాదయ్య ఏరియా ఇంజనీర్ అడ్రియాల ప్రాజెక్ట్‌కు, ఇందారం ఓసీపీలో పనిచేస్తున్న రమేష్ జీడీకె సీఈ(2,2ఎ,5)కి, ఆర్కే5 గ్రూప్‌లో డీజీఎంగా పనిచేస్తున్న పి అరుణ్ ప్రసాద్ భూపాలపల్లి కేటీకే ఓసీ-3కి, ఆర్‌జీ-2 ఏరియాలో డీజీఎంగా పని చేస్తున్న క్రిష్ణప్రసాద్ ఇందారం ఓసీపీకి, శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో డీజీఎంగా పనిచేస్తున్న మల్లయ్య శ్రీరాంపూర్ వర్క్‌షాప్‌కు, కేటీకే-1 గ్రూప్ ఏవోగా పనిచేస్తున్న శ్రీనివాస్ భట్టాచార్య ఏవో ఆర్‌కె-5 గ్రూప్ శ్రీరాంపూర్‌కు, శ్రీరాంపూర్ ఓసీపీ ఎస్ఈగా పనిచేస్తున్న కె సారంగపాణి కేటీకే-1 గ్రూప్ ఏవోగా, కేటీకే-1 ఇంక్లైన్ డిప్యూటీ ఎస్ఈ ఆర్‌కె-5 ఇంక్లైన్‌కు, ఆర్‌కె-5 ఇంక్లైన్ ఈఈగా పనిచేస్తున్న నిఖిల్ ఆర్‌జీ-2 ఓసీపీ-3కి, శ్రీరాంపూర్ ఓసీపీ ఈఈ అనిల్‌కుమార్ ఆర్‌జీ-3 ఓసీపీ-1కు, శ్రీరాంపూర్ ఓసీపీ ఈఈ సుభాష్ ఆర్‌జీ-3 ఓసీపీ-1కు బదిలీఅయ్యారు. సర్వేవిభాగం కాసిపేట గనిలో డిప్యూటీ ఎస్ఎస్‌గా పనిచేస్తున్న జి వెంకటేశ్వర్‌రావు మందమర్రి ఏరియా సర్వే అధికారిగా, ఫారెస్ట్ విభాగం శ్రీరాంపూర్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆర్‌వి రమణారెడ్డి కొత్తగూడెం, ఎల్లందు రీజియన్‌కు, ఎస్టీపీపీలో మేనేజర్‌గా పని చేస్తున్న చంద్రమణి శ్రీరాంపూర్‌కు, ఫైనాన్స్ అండ్ ఆడిట్ విభాగంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి భావన సీపీపీ కార్పొరేట్‌కు బదిలీ అయ్యారు. భూపాలపల్లిలో డీజీఎం(పర్సనల్)గా పనిచేస్తున్న ఆజ్మీరా తుకారం ఎస్టీపీపీ డీజీఎం(పర్సనల్)గా, శ్రీరాంపూర్ సూపర్‌బజార్ డిప్యూటీ పర్సనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న బి సదానందం ఆర్‌జీ-3 పర్సనల్ విభాగానికి, ఎస్ఆర్పీ-1లో డిప్యూటీపర్సనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న పాలకుర్తి రాజు శ్రీరాంపూర్ సూపర్‌బజార్‌కు, ఆర్కే6 గనిలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న కెనుసీల్‌కుమార్ ఎడ్యుకేషన్ (కార్పొరేట్)కు, ఆర్‌జీ-2 ఓసీపీ-3లో పనిచేస్తున్న ఎస్ సురేందర్ ఆర్కే6 గనికి, భూపాలపల్లి కేటీకే-1 ఇంక్లైన్‌లో పనిచేస్తున్న ఎస్ సదన్ శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ-1కు, ఎక్స్‌ప్లోరేషన్ విభాగం శ్రీరాంపూర్ సూపరిం టెండెంట్ జియాలజిస్టుగా పనిచేస్తున్న ఎస్ శ్రీనివాస్ ఆర్అండ్‌డీ కార్పొరేట్‌కు బదిలీ అయ్యారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి: ఏఐటీయూసీ

శ్రీరాంపూర్, ఆగస్టు 3: ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన 27కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్రఅధ్యక్షుడు వి సీతారామయ్య డిమాండ్ చేశారు. బకాయి లను చెల్లించకపోవడంతో సింగరేణికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గతబీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంకూడా సంస్థసొమ్మును దుర్వినియోగం చేస్తోందన్నారు. అనంతరం వివిధ కార్మికసంఘాలకు చెందిన 30మంది ఏఐటీయూసీలో చేరారు. కార్యక్ర మంలో ఉపప్రధానకార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, సహాయకార్యదర్శి మోత్కూరి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ బెల్లంపల్లి కార్యవర్గం

రెబ్బెన, ఆగస్టు 3: బెల్లంపల్లి ఏరియాలో 30 మందితో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటుచేసినట్టు టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు శనివారం తెలిపారు. కార్యవర్గంలో ఏరియాకార్యదర్శులుగా వెంకటేష్-ఖైరిగూడ, అలవేని సంపత్-గోలేటి సీహెచ్‌పీ నుంచి నియమించామన్నారు. సమావేశంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు మంగీలాల్, కిరణ్‌మాంత్, సమ్మయ్యఏరియా కార్యదర్శి వెంకటేష్‌ట్రేజరర్‌వంగమహేందర్ పాల్గొన్నారు.

'సింగరేణి ఆసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపర్చాలి'

మందమర్రిటౌన్, ఆగస్టు 3: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలను మెరుగుపర్చాలని శనివారం కొత్తగూడెం చీఫ్ మెడికల్‌ఆఫీసర్ సుజాతకు సీఐటీయూ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏరియా బ్రాంచ్‌సెక్రటరీ వెంకటస్వామి, సీనియర్ నాయకులు రమణ మాట్లాడుతూ ఆసుపత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బందిని నియమించాలని కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల ఆసుపత్రులను ఎత్తివేస్తే ఎలా?

సింగరేణిలో యాజమాన్యం కార్మికులకు మెరుగైన వైద్యం అందించేస్తామని ఉన్న ఉన్నత వైద్యశాలలను ఎత్తేయడం ఎంతవరకు సమంజసమని సీఐటీయూ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్ వెంకటస్వామి, అల్లి రాజేందర్ అన్నారు. శనివారం వారు మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిని ఎత్తివేయడానికి నిర్ణయం తీసుకోవడం సరికాదని, దీన్ని వెంటనేఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు.



మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషిచేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి

బెల్లంపల్లి, ఆగస్టు 3: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషిచేస్తామని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం ఆసుపత్రి పరిరక్షణ కమిటీ నాయకులు ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే, చీఫ్ మెడికల్ ఆఫీసర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చీఫ్ మెడికల్ ఆఫీసర్ సుజాతతో కార్మికులకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆసుపత్రికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. డాక్టర్లు, సిబ్బందిని నియమిస్తామన్నారు.

పకడ్బందీ రక్షణ చర్యలు చేపట్టాలి: జీఎం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

శ్రీరాంపూర్, ఆగస్టు 3: భూగర్భ, ఉపరితల గనుల్లో పకడ్బందీ రక్షణ చర్యలు చేపట్టాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. శనివారం ఆయన ఈపీఆర్ అప్‌డేట్, ఉద్యోగులు, వారి పిల్లల ఫొటోల అనుసంధానం, ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రతి అధికారి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటు జీఎం గోపాల్‌సింగ్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఇందారం ఓసీపీ పీవో ఎం శ్రీనివాస్, ఏజెంట్లు ఏవీ రెడ్డి, రాముడు, డీజీఎంలు, అన్ని గనులు, విభాగాల అధిపతులు, ఇంజనీర్లు, సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

'పెన్షన్ ఎరియర్స్ వెంటనే చెల్లించాలి'

శ్రీరాంపూర్, ఆగస్టు 3: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధానకార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 11వ వేజ్‌బోర్డు ఒప్పందం మేరకు 1-7-2021నుంచి అమలు కాబడి గత సంవత్సరం మే నెలలో కోల్‌ఇండియా ఉద్యోగులకు పెన్షన్‌తో పాటు పెన్షన్ ఎరియర్స్ అందించారన్నారు. కానీ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు రావడం లేదని, దీనివల్ల ఆర్థికంగా తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి, సీఎంపీఎఫ్ అధికారులు చొరవ తీసుకొని తమకు పెరిగిన పెన్షన్‌తోపాటు ఎరియర్స్ బకాయిలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

'రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలి'

మందమర్రిటౌన్, ఆగస్టు 3: సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఏరియాల్లో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలని సింగరేణి సీఎండీ బలరాంకు శనివారం మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ హైదరాబాద్‌లో వినతిపత్రం అందించారు. ప్రతినెల తలసేమియా బాధితులకు రక్తం అవసరం ఉంటుందని, దీన్నిదృష్టిలో ఉంచుకుని రక్తదాన శిబిరాలను నిర్వహించాలని కోరారు. మంచిర్యాల బ్లడ్‌బ్యాంకులో రక్తం నిల్వచేసి బాధితులకు రక్తం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

'అధికారులకే యెల్లో, రెడ్ కార్డుల విధానం వర్తింపజేయాలి'

శ్రీరాంపూర్, ఆగస్టు 3: సింగరేణిలో యెల్లో, రెడ్ కార్డుల విధానం అధికారులకే వర్తింపజేయాలని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. వాస్తవంగా ఎవరైనా సూపర్‌వైజర్ రక్షణ చర్యలు అమలు చేద్దామని భావిస్తే.. వారికి వేధింపులు తప్పవన్నారు. ప్రమాదం జరిగినప్పుడు సూపర్‌వైజర్లకు, సిబ్బందికి ఉద్వాసన పలికేందుకే ఇలాంటి తప్పుడు విధానాలు అమలు చేస్తున్నారని, ఆదేశాలు ఇచ్చిన అధికారులు మాత్రం ఎలాంటి శిక్ష పడకుండా తప్పించు కుంటారని ఆరోపించారు. సూపర్‌వైజర్, సిబ్బందికి కాకుండా అధికారులకు మాత్రమే యెల్లో, రెడ్‌కార్డుల విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.